క్లుప్తంగా

ఉపాధి హామీ పనులపై సమీక్ష

గుడ్లూరు: ఉపాధి హామీ పనులపై స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏపీఓ అబ్దుల్లా బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు కూలీలు ఉదయం 6 గంటలకే పని ప్రదేశాలకు చేరుకొని 10 గంటలు వరకు పనులు చేయించాలని ఫీల్డు అసిస్టెంట్లకు సూచించారు. గ్రామసభల ద్వారా గుర్తించిన పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తు మేట్లను సమన్వయం చేసుకుంటూ పనులు చేయించాలన్నారు. ఇచ్చిన కొలతలు ప్రకారం పనులు చేసుకుంటే కూలీలకు రోజుకు రూ.300 కూలీ పడుతుందన్నారు. మస్టర్లులో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో జరుగుతున్న పనులను టెక్నికల్ అసిస్టెంట్‌లు ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలన్నారు. ఉద్యానవన పంటలను ఎక్కువగా సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించారు.

నేడు సమస్యల పరిష్కార వేదిక

ఉలవపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఉదయం సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రారెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సబ్ కలెక్టర్‌విద్యాధరి కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు. ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించండి

యర్రగొండపాలెం: గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఎంఈవోలు ఆంజనేయులు, మల్లు నాయక్ బుధవారం కోరారు. ప్రైవేటు పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరిగా ఉండాలన్నారు. గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని వారు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు. ప్రైవేటు పాఠశాలల్లో సైతం ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్ బోధించాలని, సంబంధిత పాఠ్య పుస్తకాలు ఉపయోగించుకోవాల్సి ఉంటుందని, ఫీజు వివరాలు డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శించాలని వారు వివరించారు. ప్రతి పాఠశాలలో సౌకర్యవంతంతో పాటు పరిశుభ్రమైన మరుగుదొడ్లు విద్యార్థులకు అనుగుణంగా ఉండాలన్నారు. బస్సులు నిర్వహించే వారు సంబంధిత లైసెన్సులు కలిగి కండిషన్‌లో ఉండే బస్సులు, లైసెన్స్ పొందిన డ్రైవర్లు ఉండేలా చూసుకోవాలని నిబంధనలు జారీ చేశారు. మండల పరిధిలో మొత్తం 14 పాఠశాలలకు మాత్రమే ప్రభుత్వ గుర్తింపు ఉందని వారు తెలిపారు.

నేడు పాఠశాలలు పునఃప్రారంభం

కొమరోలు: మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం అవుతున్నట్లు మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలను తెరచి పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందించాలని తెలిపారు.

బడి పిలుస్తోంది..!


బ్యాగు బరువుతో విద్యార్థులు


ఆటోల్లో నోట్ పుస్తకాలు

- నేటి నుంచి మోగనున్న బడిగంట
- విద్యార్థుల వీపులపై బ్యాగుల మోత.. తల్లి దండ్రుల జేబులకు కోత

కనిగిరి రూరల్: పాఠశాలలు అధికారికంగా గురువారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. నెల రోజులకు పైగా ఆటపాటలతో గడిపిన చిన్నారులు పాఠశాలలు పునః ప్రారంభం కానుండటంతో నేటి నుంచి బడిబాట పట్టనున్నారు. పిల్లలను పాఠశాలలకు పంపిచేందుకు తల్లిదండ్రులు కావాల్సిన సరంజామను సిద్ధం చేస్తున్నారు. బుక్‌లు, బ్యాగుల, చెప్పల్, ఫాన్సీ వస్తువులు కొనుగోలు చేస్తూ కన్పించారు. బుధవారం అంతగా హడావుడి లేక పోయినా బుక్‌స్టాల్స్ వద్ద గురువారం మరింత రద్దీ పెరిగే అవకాశం ఉంది.

పిల్లలకు మోత..తల్లి దండ్రుల జేబులకు కోత

చదువుకునే రోజులు పోయి..చదువు కొనే రోజులు వచ్చాయి. జూన్ నెల వచ్చిందంటే తల్లి దండ్రులు భయపడుతున్నారు. ఏటా పెరుగుతున్న ధరలతో పిల్లలకు కావాల్సిన విద్యా సరంజామ సమకూర్చేందుకు తల్లడిల్లుతున్నారు. నోట్ బుక్‌లు, పుస్తకాలు, వగైరా వస్తువులు కొనుగోలుకు ఎల్‌కేజీ విద్యార్థికి వెయ్యి వరకు బుక్‌లు వగైరాకు అవుతుండగా, 2వ తరగతి నుంచి 5 వ తరగతి వరకు పాఠ్య పుస్తకాలకు, నోట్ బుక్‌లు, గైడ్‌లు, ఇతర సామగ్రి కొనుగోలుకు దాదాపు రూ.6 వేలకు పైగా ఖర్చుపెట్టాల్సి వస్తోంది. 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు మూడు నుంచి 8 వేలకు పైగా వెచ్చించిచాల్సి వస్తోందని తల్లిదండ్రులు చెప్తున్నారు. ఇక ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల ధరలు ఇష్టారాజ్యం. గత ఏడాది కంటే ఈ ఏడాది నోట్‌బుక్‌లపై ఎంఆర్‌పీ ధరలు 15 నుంచి 20 శాతం వరకు పెరిగాయి. దీంతో చదువుల పెట్టుబడులకు మధ్య తరగతి వర్గాల ప్రజలు అల్లాడుతున్నారు. తల్లిదండ్రులు ఎక్కువ శాతం ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతుండటంతో దీన్ని ఆసరాగా చేసుకొని ఫీజులు, వివిధ రకాల ఖర్చుల రూపంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు దండుకుంటున్నారు. ఎల్‌కేజీ చదువుకు కూడా ఒక విద్యార్థికి ఏడాదికి సుమారు రూ.8 నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. పాఠశాల స్థాయిని బట్టి దాని రేటు ఇంకా పెంచి దోపిడీ చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని ఉచితమైనా..

సామాన్య మధ్య తరగతుల వారు కూడా తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించాలనే ఆశతో అప్పుల ఊబిలోకి దిగుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో పాటు, అన్ని మౌలికవ వసతులు, ప్రతి విద్యార్థికి ఉచితంగా స్టూడెంట్ కిట్స్‌ను కూడా అందచేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు నేడు స్కీం కింద సరస్వతీ నిలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. రోజుకో మెనూ కూడా పౌష్టికాహారంగా అందచేస్తున్నారు. పిల్లలకు ఎలాంటి మెను పౌష్టికాహారంగా ఇవ్వాలనే దానిపై పట్టికల ద్వారా అందచేస్తూ ఈ మేరకు వంట మనుషులకు శిక్షణలు కూడా ఇచ్చారు.

వ్యాపార కేంద్రాలుగా విద్యాలయాలు:

విద్యాలయాలు వ్యాపార కేంద్రాలుగా మారి ప్రజలను నిలువునా దోచుకుంటున్నాయి. అడ్మిషన్ ఫీజు మొదలు అన్ని రకాల వస్తువులు(షూ, టై, యూనిఫాం, బుక్స్, బెల్టు ఇలా అన్ని వారే సరఫరా చేస్తూ.. భారీగా కమీషన్లు తీసుకుంటూ క్యాష్ చేసుకుంటున్నారు. చిన్నారుల తల్లి దండ్రుల శ్రమను దోచుకుంటున్నారంటే అతిశయోక్తి కాదు.


సిబ్బందితో మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

జవాబుదారీతనంగా పనిచేయండి

- చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: సచివాలయ అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంగా వ్యవహరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 7వ సచివాలయాన్ని బుధవారం ఆయన అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధిగా ప్రతి రోజు మూమెంట్ రిజిస్టర్‌ను అమలు చేయాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ వర్క్‌కు వెళ్లి ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకుని పరిష్కరించాలన్నరు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందజేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు


సచివాలయి సిబ్బంది సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: సమయపాలన పాటించకుండా విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సచివాలయ సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ కె.లలిత హెచ్చరించారు. సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ ఇంజినీర్ అసిస్టెంట్లతో బుధవారం సాయంత్రం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజర్ తప్పనిసరిగా వేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల నిర్వహణ రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. విధి నిర్వహణ రికార్డులు, సంక్షేమ పథకాలు రికార్డుల సిద్ధం చేసి జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. నూతన ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏఓ కేవీ క్రిష్ణారావు, సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్ రెడ్డి, రఘురామ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన విద్య


చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మర్రిపూడి: కార్పొరేట్ పాఠశాలల కంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన విద్య అందుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాధురి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన పడమటిబజారు, దళితవాడ, ఏరియాలో అంగన్‌వాడీ సెంటర్‌లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యను పూర్తి చేసుకుని ఎలిమెంటరీ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరుతున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ఏర్పాటు చేసి ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం కాన్వెంట్ల కంటే అంగన్‌వాడీ సెంటర్‌లో మెరుగైన విద్య అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుచరిత, ఐసీసీ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు హైమవతి, సుదేష్ణా, ఎం.కేజియా, ఆయాలు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత


అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న చైర్మన్ గఫార్


పిల్లలకు, తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతపై వివరిస్తున్న నాయబ్‌రసూల్

కనిగిరి రూరల్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 11వ వార్డులోని కాశిరెడ్డి నగర్, ఎస్టీ కాలనీల్లో బుధవారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందర్నీ తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలన్నారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనికి పంపినా.. పనిలో చేర్చుకున్నా చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలను అరికట్టడమే లక్ష్యంగా అందరూ పనిచేద్దామని పిలుపునిచ్చారు. విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని వివరించారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్ మంద్రు రమేష్, జీఎస్ అండ్‌జీడీకే ఫౌండేషన్ కో ఆర్డినేటర్ నవకుమార్, సచివాలయ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పామూరు: బాల కార్మిక వ్యవస్థను రూపుమాపే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్ అన్నారు. అంతర్జాతీయ బాలకార్మిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఎస్టీకాలనీలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాల్యాన్ని పనిభారంలోకి పంపడం సరికాదని, వారిని బడికి పంపి భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది వారికి ఉజ్వలమైన భవిష్యత్‌ను అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా వివిధ పనులకు పోతున్న పిల్లలను, బడిబయట పిల్లలకు విద్య ఆవవ్యకతను గురించి వివరించి బడిఈడు పిల్లలంతా పనులకు కాకుండా విద్యాభ్యాసం కోసం పాఠశాలకు వెళ్లాలని సూచించారు. భువనేశ్వరం ప్రవీణ్, పలువురు పాల్గొన్నారు.

పట్టణంలో వన్‌వే బోర్డుల ఏర్పాటు



వన్ వే బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

కనిగిరి రూరల్: ట్రాఫిక్ సమస్య నియంత్రణలో భాగంగా పోలీస్ అధికారులు సూచించిన మేరకు అడుగులు ముందుకు వేశారు. ఎస్సై టి.త్యాగరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రోడ్లల్లో బుధవారం వన్ వే, బోర్డులను ఏర్పాటు చేశారు. కనిగిరిలో పెరిగిన ట్రాఫిక్ సమస్య నియంత్రించేందుకు వన్ వే దారులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈమేరకు ప్రజలకు అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని,జరిమానాలువిధిస్తామనిహెచ్చరించారు.

నేటి నుంచి విద్యార్థి కిట్ పంపిణీ



పాఠ్య, నోట్ పుస్తకాలు

కనిగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన, ఉచిత విద్యను అందించే విధంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు వరుసగా నాలుగేళ్ల పాటు జగనన్న విద్యా కానుక పేరుతో కిట్స్‌ను ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందచేశారు. అయితే కొత్తగా వచ్చిన ప్రభుత్వం కూడా ఆ పథకానికి పేరి మార్చి విద్యార్థులను కిట్స్‌ను అందచేసేందుకు సిద్ధం చేసింది. విద్యా కానుక(జేవీకే)ను, స్టూడెంట్స్ కిట్స్‌గా పేరి మార్చి గురువారం పాఠశాలలకు పునః ప్రారంభం రోజు నుంచి విద్యార్థులకు అందచేయనున్నారు.

కనిగిరి నియోజకవర్గంలోని 458 ప్రభుత్వ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి అవసరమైన కిట్లను ముందుగానే సిద్ధం చేశారు. గత 20 రోజుల క్రితమే 1,52,234 నోట్‌బుక్స్, 40,085 పాఠ్య పుస్తకాలు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని కేంద్రాలకు 45 శాతం (స్టాక్ పాయింట్‌లకు) చేరాయి. ప్రస్తుతం పూర్తిస్థాయిలో విద్యార్థులకు సంబంధించిన పాఠ్య, నోట్ పుస్తకాలు వచ్చినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. అయితే స్టూడెంట్స్ కిట్స్‌లోని 8 వస్తువుల్లో 3 రకాల వస్తువులు కొన్ని మండలాలకు చేరలేదని తెలిసింది.

☛ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రభుత్వ, జెడ్పీ, ఎయిడెడ్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు సుమారు 458 ఉన్నాయి. ఈమేరకు గతేడాది ఆయా పాఠశాలల్లో 1-10 తరగతుల విద్యార్థులు సుమారు 27,011 మందికి రూ.7,13,68,800 విలువైన జేవీకే కిట్స్ అందచేయగా, ఏ ఏడాది కూడా అదే సంఖ్యలో స్టూడెంట్ కిట్స్ అందచేయనున్నారు. కిట్స్‌లోని వస్తువుల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు, బ్యాగులు, డిక్షనరీలు, బెల్టులు స్టాక్ పాయింట్లకు చేరగా యూనిఫాం (మూడు జతలు), షూ, సాక్స్(రెండు జతలు) రావాల్సి ఉందని తెలిసింది. ఈ మేరకు గురువారం పాఠశాలలు పునః ప్రారంభం రోజున అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు వాటిని పంపిణీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

మండలాల వారిగా స్టూడెంట్ కిట్స్ వివరాలు:

మండలం	పాఠశాలల సంఖ్య	మొత్తం కిట్ల వివరాలు
కనిగిరి	116	8,631
హెచ్ఎంపాడు	66	2,852
పీసీపల్లి	59	3,031
సీఎస్‌పురం	63	3,809
పామూరు	88	4883
వెలిగండ్ల	66	3,803
మొత్తం	458	27,011


స్టాక్ పాయింట్‌లకు చేరిన బ్యాగులు, ఇతర సామగ్రి

పాఠ్య, నోట్ బుక్ వివరాలు ఇలా..

టెస్ట్ బుక్‌లు కనిగిరి మండలంలో 45,000, వెలిగండ్లలో 31,066, పామూరులో 30,000, సీఎస్ పురంలో 29,000, హెచ్ఎం పాడులో 23,539, పీసీపల్లిలో 14,477లు, నోట్ బుక్‌లు కనిగిరి మండలంలో 50,412, వెలిగండ్లలో 21,452, పామూరులో 26, 468, హెచ్ఎంపాడులో 16,026, సీఎస్‌పురంలో 20,518, పీసీపల్లిలో 6,780 ఇవ్వాల్సి ఉంది. ఒకట్రెండు మండలాల్లో తప్ప మిగిలిన అన్ని మండలాలకు సంబంధించి అన్ని నోట్, టెస్ట్ బుక్స్‌లు స్టాక్ పాయింట్లకు చేరినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

మట్టి నమూనా పరీక్షలు శ్రేయస్కరం

కంభం: మిరపలో విచక్షణ రహితంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూమి పాడవుతుందని ఉద్యానవన శాఖ అధికారిణి డి.శ్వేత అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మట్టి పరీక్షలపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. రైతులు మట్టినమూనా పరీక్షలు నిర్వహించి తగు మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడుకోవడం వల్ల నాణ్యమైన దిగుబడులు పొందవచ్చన్నారు. డిజిటల్ గ్రీన్ సంస్థ వారి ఈ మిర్చి 2.0 ప్రాజెక్టులో భాగంగా ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా, ఇతర రైతులకు రూ.50 కే మట్టి పరీక్షలు నిర్వహించి రిపోర్టు అందజేయడంతో పాటు పంట కాలం మొత్తం ఐవీఆర్ కాల్స్ ద్వారా సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ టెక్నికల్ కో ఆర్డినేటర్ కమలాకర్, హెచ్ఈఓ శేషగిరి, పాల్గొన్నారు.

పొగాకు అత్యధిక ధర కేజీ రూ.331


టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

కొండపి(సింగరాయకొండ): కొండపి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో అత్యధిక ధర కేజీ రూ.331 పలికింది. అనకర్లపూడి, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పరాజుపాలెం గ్రామాల రైతులు 1031 బేళ్ల వేలానికి ఉంచగా 934 బేళ్ల కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 97 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ 280.45 పలికిందని, వేలంలో 22 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు.

993 పొగాకు బేళ్ల కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 993 బేళ్లు కొనుగోలయ్యాయి. టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు, సాదువారిపాలెం గ్రామాల రైతులు 1089 బేళ్లను వేలానికి ఉంచగా వ్యాపారులు వివిధ కారణాలతో 96 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.300, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.281.40 పలికింది. వేలంలో మొత్తం 40 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com